# వ్యక్తిగత కర్తవ్యాలు

[కథానిక]

= శ్రీ బూరుగుల సుబ్బారావు =

కన్నయ్య పెళ్లిచేసికొని భార్యతో సుఖంగా కాలక్షేపం చేస్తున్నాడు. తల్లికోరిక ఇన్నాళ్లకి నెరవేరింది. చాలాకాలం ఆ శుభముహూర్తాన్ని ముందుకు నెట్టుకుంటూవచ్చి చిట్టచివరకి కన్నయ్య తల్లిని మరింత మరిపించలేకపోయాడు.

వచ్చిన సంబంధాలలో కొన్ని తల్లిని సంతృప్తిపరచలేకపోయాయి. మరికొన్నిటిని కన్నయ్య నిరుద్దేశపూర్వకంగా నిరాకరించాడు. తల్లి ఆఖరికి విసుగుచెంది కొడుకుని స్పష్టంగా అడిగింది—"ఐతే నీకు ఎలాంటి పిల్ల నచ్చుతుందిరా? నీకు నచ్చే పిల్ల ఎలా ఉంటుందో చెప్పు" అని. సంభాషణ మార్చటానికీ, తల్లిని మరిపించటానికీ కన్నయ్యచేసినప్రయత్నం నిష్ఫలమయింది. తల్లి పట్టుదలతో తన ప్రశ్నని తిరిగితిరిగి రెట్టించింది. "పెళ్లిచేసుకున్నవాడు అప్రియమైన కట్టుబాట్లలో పడ్తాడు. ఇంక తొందరపడి పెళ్లిచేసుకున్నవాడి సంగతి చెప్పనక్ఖర్లేదు. సఫలీకృతవివాహాల ఆవరణ చాలా సంకీర్ణంగా ఉంటుంది. నేను చాపిన కాలు ఆ ఆవరణలో పడుతుందని నేను సాహసించి చెప్పలేను"అని కన్నయ్య గంభీరాకృతిని దాల్చాడు. "అలా అని చెప్పి యావజ్జీవం బ్రహ్మచారిగా ఉంటావటరా? నీ ఇష్టం, ఆలోచించుకో. ఎప్పుడోఒకప్పుడు నీ కళ్లూ, మెదడూ ఉపయోగించి తెగించకుండా ఉండగలవా? ఆపక్షంలో ఎప్పుడో చేసే ఆ పనిని ఇప్పుడే - నేను బ్రతికిఉండగానే చెయ్యి. నేను శాంతిగా కళ్లుమూయటం నీకు ఇష్టమైతే." తల్లి చేసిన చివరిసంకేతం కన్నయ్యజడప్రాయమైనదేహాన్ని కావలసినంత కుదిపింది. తల్లిదండ్రులపై కన్నయ్యకి ఉన్న భక్తిప్రేమలు అపారమైనవి; విలక్షణమైనవి; ఆ తూకంలోనే చాలా గుప్తమైనవికూడా. కాని చిన్నతనం నుంచీ ఇరుగుపొరుగువాళ్లందరికీ అతను తల్లిదండ్రులపై తిరుగుబాటుచేసేవాడిలా కనిపిస్తూవచ్చాడు. ఆతని ఆంతర్యాన్ని తెలిసినవాళ్లు ఎవరైనా ఉన్నారనికూడ చెప్పలేం. అతను అన్యమనస్కుడు, ఉదాసీనుడు. అతను లోకుల నోళ్లకి తాళాలు వెయ్యలేదు. లోకుల అభిప్రాయాల్ని మార్చటానికీ, అనుకూలంచేసుకోటానికీ అతను జీవించటం లేదు. కాని ఆసంగతి అలా ఉంచుదాం.

ఇప్పుడు కన్నయ్యహృదయంలో అణగిఉన్న మాతృప్రేమ ఒక్కసారి ఒత్తిడి తగిలి పైకి విజృంభించింది. తల్లికోర్కని నెరవేర్చని పక్షంలో అతనికి శాంతి ఎలా వస్తుంది? పరిణామంగా కన్నయ్య వివాహం జరిగిపోయింది.

౨

శ్రావణ మంగళవారంనాడు పేరంటపుపిలుపుకి వెళ్లిన కొత్తకోడల్ని ఉద్దేశించి అత్త అంది—"దైవం మన ఎన్నికకి తోడుపడ్డాడు. పిల్లతోబాటు ఇంట్లోకి లక్ష్మీదేవి వచ్చింది." కొడుకు ఎదురుగా వాలుకుర్చీలో పుస్తకంపేజీలు తిరగవేస్తూ కూర్చున్నాడు. తల్లి మళ్లీ తన ఆనందాన్ని మాటలలో వ్యక్తపరుస్తూ అంది—"పిల్ల ఎంత బంగారపుబొమ్మో అంత తెలివైనది, అంత నెమ్మదయినదీని". కొడుకు "హూఁ"అని

పుస్తకం మూశాడు. తరువాత తెరచి పేజీలు తిరగ వేస్తున్నాడు. "మొన్న ఏదో మాటలసందర్భంలో ఏమందనుకున్నావూ? 'అత్తయ్యా, మీవల్ల నాకు తల్లి లేని కొరత తీరిపోయింది.' అని. ఇదంతా నా పుణ్యం కాకపోతే ఏఁవిటి చెప్పు. పాపం, తల్లి లేని పిల్ల! దాన్ని గుండెల్లో పెట్టి దాచుకుంటాను......పోల్చి చూసుకుంటే ఇప్పటికీ అప్పటికీ మన ఇంట్లో తేడా కనబడటం లేదూ? ఇన్నాళ్లూ వెలితిగా ఉన్నది ఏదో ఇప్పుడు పూర్తిఅయినట్టు తోచటం లేదూ?..."

"ఊఁ" అని కొడుకు కూర్చున్న స్థలాన్ని సానుకూలం చేసుకుంటూ, కూర్చున్న స్థలంలోనే తిరిగి జమాయించి సుస్థిరుడయ్యాడు. "అది నా నోముల మాట. నేను పూర్వజన్మంలో నోచిన నోముల ఫలమంతా ఈవిధంగా నాకు సంప్రాప్తమయింది......"

ఈ విధంగా తల్లి బ్రహ్మానందంతో నిండిపోయిన తన హృదయం కావలసినంత తేలిక అయినంత వరకూ పొగడ్త జారీచేసింది. ఆఖరికి కొడుకుని సంబోధించి అంది—"నా సంతోషం నీకూ ఉందా, లేక ఇదంతా నా పిచ్చి వాగుడేనా?" కొడుకు పుస్తకాన్ని మూసి ఎదురుగా ఉన్న బల్లమీద పెట్టి ఇంకోపుస్తకం కోసం కాబోలు ఇటూ అటూ ఉన్న పుస్తకాల్ని చేత్తో తడుముతున్నాడు. తల్లిమాటకి తిరిగి ఇందాకటి పుస్తకాన్నే చేత్తో పట్టుకొని దభీమని కుర్చీలో కూలబడ్డాడు.

"ఏమిరా కన్నా, సిగ్గుపడక చెప్పవూ?"

"సిగ్గెందుకూ?"

"మరి చెప్పు"

"ఏఁవిటి చెప్పేదీ?"

"రామాయణం అంతా విని చివరికి ఏదో అన్నట్టుగా ఉంది."

తల్లి లేచి ఏదోపనిమీద కొడుకు చదువుకొనే గది వదలి లోపలికి వెళ్లిపోయింది.

## ౩

ఆకాశమంతా కారుమబ్బులతో ఊగిసలాడుతూంది. పెనుగాలి వీస్తూంది. అర్ధరాత్రి. కన్నయ్య చదువులోంచి లేచి కిటికీలోకి చూస్తున్నాడు. ప్రళయాన్ని మించిన మహాప్రళయం ఆ మూగవ్యక్తుల హృదయాల్లో రేగుతూంది. సతీదేవి ప్రాణనాథుని సమీపించి అంది—"ఏఁవిటది?" ప్రాణనాథుడు జవాబిచ్చాడు—"ఆకాశం పురుటినెప్పులు పడుతూంది." సతీదేవి అంది—"మంత్రసానితనం చెయ్యటానికి సంకోచంగా ఉందా?" ప్రాణనాథుడు మాట్లాడడు. భోరున వర్షం ప్రారంభించింది. ఝుమ్మనే వర్షపు జడితో కిటికీతలుపులు తెరుచుకుంటూ, మూతలుపడుతూ కొట్టుకొంటూంటే సతీదేవి భర్తచెయ్యి పుచ్చుకొని లాగింది. ప్రాణనాథుడు కదలడు. ఆమె కిటికీ తలుపులు బలవంతంగా మూసింది. బయట కుంభవృష్టి కురుస్తూఉంది.

"ఇప్పుడు ఎంతయిందో తెలుసా మీకు?"

"అదిగో, గడియారపు ముళ్లు పైకి పోయి ఒకటై పోయాయ్."

భర్త పాన్పుపై పడుకున్నాడు. భార్య ప్రక్కగా నించుంది. ఉండగా ఉండగా అతను గాఢనిద్రలో గుఱ్ఱులుతీస్తున్నాడు.

## ౪

ఇన్నాళ్లూ ఆడజాతికి దూరంగా ఉండి దాన్ని నిర్లక్ష్యంతో చూచే కన్నయ్య మారిపోతున్నాడు. రోహిణిఆగమనంతో కన్నయ్యప్రకృతి క్రమేపీ మార్పుజెందింది. పుస్తకాలమధ్య తిష్ఠవేసుకొని కూర్చొనే కన్నయ్య పుస్తకాల్ని తీసి అందంగా బీరువాలో పేర్చాడు. రోహిణి కలిగించిన వింతధ్యానంలో పడ్డాడు. ఆమె గృహకృత్యాలలో వ్యస్తురాలై ఉండటం చూచి వ్యాకులపడేవాడు. ఇంటిపనులలో జోక్యం కలుగజేసుకోవద్దని చాటుగా పిల్చి రహస్యం చెప్పటం మొదలుపెట్టాడు. తిరిగి ఆచారపరాయణురాలైన తల్లి ఒక్కర్తే కష్టపడిపోతుం దన్న సంగతి జ్ఞప్తికివస్తే బాధపడేవాడు.

రోహిణి పాడే పాట ఇంటిలోపల మృదువుగా కంపిస్తూంది. ఇవతల సావిట్లో కన్నయ్య కూర్చొని వ్రాసుకుంటున్నాడు. అస్పష్టంగా వినిపించే ఆ పాట

కన్నయ్యని ఉండిఉండి ఊపివేస్తూంది. అతను కలం ఆపి చెవులు నిట్రంచేసి వింటున్నాడు. పాట ఆగిపోయింది. కన్నయ్య లోపలికి వెళ్లి చూచాడు. రోహిణి మడిగట్టుకొని వంట వండుతూంది. 'చుంయ్'మనే పోపుశబ్దంతో; ఇంగువపరిమళంతో కూడిన 'ఘుమఘుమ'మధ్య రోహిణిప్రతిమ వింత ఆకర్షణని వెదజల్లుతూంది. వంటపని అంతా ఒక్కర్తే ఏం చలాకీగా చేసేస్తూంది! "రోహూ!"—కన్నయ్య వెఱ్ఱిగా పిల్చాడు. రోహిణి కూరగిన్నె కుదుపుతూ అంది :

"ఏఁవిటది?"

"నువ్వు పాట పాడగలవని నాకు చెప్పలేదేం?"

"చెబ్తాను ఉండండి. కూర మాడిపోతూంది."

తడిబట్టలోంచి రోహిణిశరీరం నిగనిగలాడుతూంది. నిర్లక్ష్యంగా వదిలిపెట్టబడ్డ తలవెండ్రుకలు విచ్చలవిడిగా శారీరకగతిని అనుసరించి చిరిగంతులు వేస్తున్నయ్.

"రోహూ, తలవెండ్రుకలు వెనక్కి కట్టుకో. నిప్పులో పడి కాలిపోతాయి."

రోహిణి తలవెండ్రుకలు వత్తిగించుకొని, కన్నయ్యవైపు చురచుర చూచింది. తిరిగి భుజాలు ఊపుకుంటూ పచ్చడి రుబ్బటం ప్రారంభించింది.

"నువ్వు తడిబట్టతోనే ఉండిపోయావేం?"

"మీరు వెళ్లి పనిచూసుకోండి. ఈ ఆడసోదంతా మీ కెందుకు?"

కన్నయ్య ఎదురుగా పీట వాల్చుకొని కూలబడ్డాడు.

"పోనీ, నువ్వు పాట పాడ్తూఉండు. నేను వింటూ కూర్చుంటా."

"అమ్మ వచ్చిందంటే బాగుండదు. వెళ్లండి."

❀

పెళ్లిఅయిన కొత్తలో కన్నయ్య తన ఆదర్శపు ఎత్తునుంచి రోహిణిని క్రీగంట చూసేవాడు. ఆమె తన అభివృద్ధికి ఆటంకమని భావించి నిరసనచేసేవాడు. అయినా ఆమెద్వారా తల్లికోరిక పూర్తిఅయిందికదా అన్న ఓదార్పుతో నిట్టూర్చేవాడు. రోహిణి ఎంత అందమైనదో అంత గుణవంతురాలు. భర్తనిరసన వాక్యాల్ని మౌనపు గుటకలతో మ్రింగివేస్తూ అత్తగారి పంచనే మసలుతూ ఉండేది. కాని రోజులు గడచినకొద్దీ కన్నయ్యలో మార్పు ప్రవేశించింది. అతను తన వ్రాత, చదువులు మందగింపజేస్తూ భార్యవైపు లాగబడుతున్నాడు. శుభం! అందరూ కోరేదికూడా అదే. కాని 'అతి'సూచనలు కనబడగానే ఆ శుభవాంఛకులు గడ్డంక్రింద చెయ్యిపెట్టుకుంటారు; బుగ్గలు నొక్కుకుంటారు. అత్తగారు వింతజీవి. సాంప్రదాయికంగా వచ్చే అత్తాకోడళ్ల అన్యోన్యం ఆమె ఆశించదు. ఆమెకి అక్కర్లేదు. తన కొడుకూ, కోడలూ సుఖిస్తున్నారంటే అదే ఆమెకి పదివేలు. ఆమెయొక్క అస్తిత్వం కొడుకూకోడళ్లకు బాధాకరం అవుతుందేమో అని ఆశంకతో ఆమె ఆందోళనపడుతూంది.

అత్తగారు తెల్లవారఝామునే లేచి మేలుకొల్పులు పాడుతుంది. స్నానం చేసి జపంలో లీనమవుతుంది. ఆవిడజీవితం నియమం, నిష్ఠతో ఎంత సూత్రబద్ధంగా ఉందో కొడుకుజీవితం అంత నియమరహితంగా, విశృంఖలంగా ఉంది. అతనిలో ఆ గుణాలు వివాహానికి పూర్వం లేవని కాదు. నట్టింట కోడలు రాగానే కొడుకు తన ఆచరణలో మార్పు తెచ్చిపెట్టుకుంటాడని ఆ విధవ ఆశించింది. కాని దానికి ప్రతికూల పరిస్థితి ఏర్పడటంతోనే, తన ఆచారవ్యవహారాలకి విరుద్ధమైన సంఘటనలు సంభవిస్తూంటే ఆమె వ్యాకుల పడుతూంది.

యువతీయువకుల ఉప్పొంగుల పారస్పరికసమ్మిళితవాహిని కట్లుతెంచుకొని ప్రవహిస్తూంటే ఆనకట్ట కట్టేది ఎవరు? ముఖ్యంగా ఆమెమాత్రం అటువంటి వ్యవహారాల్లో జోక్యం కలుగజేసుకోలేదు. ఇలాంటి పరిస్థితులలోనే ఎలాంటి కలహాలైనా వస్తాయి. అత్త, కోడలు, కొడుకు అనే పదాలు నిర్వచింపబడి సార్థకమౌతూఉంటాయి.

## ౬

తెల్లవారి చాలాసేపయింది. కన్నయ్య కళ్లు నులుపుకుంటూ లేవబోతూంటే అతనిమీద వ్రాలిపడి ఉన్న రోహిణికూడ లేచిపోయింది. ఆమె కిటికీవైపు చూచి కంగారుపడింది. బారెడు పొద్దెక్కింది. కన్నయ్య జోగుతూ లేచి పడకకుర్చీలోకి కూలబడ్డాడు. రోహిణి భయపడుతూ అంది—"లేచి ముఖం కడుక్కోండి. అమ్మ కోప్పడుతుంది". కన్నయ్య పమిట సర్దుకుంటూన్న రోహిణిని దగ్గరకి లాక్కున్నాడు—"నువ్వు నాదగ్గరనుంచి వేరుకాకు. నేను బయటికి వెళ్ల లేను."

బయట అత్తగారు చేసే రామస్మరణ స్పష్టంగా వినబడుతూంది. కొడుకు ఈరోజున మొట్టమొదటిసారి తల్లియొక్క ఆధ్యాత్మికచేష్టని గర్వంతో ఆదరించలేకపోయాడు. ఆ గొణగొణధ్వనికి దూరంగా ఎక్కడికో తప్పించుకొనిపోవాలనే భావంలాంటిది ఏదో అతనిలో పుట్టి అతణ్ణి వ్యాకులపరస్తూంది.

రోహిణి చకచకా బయటికి పోయి అన్ని పనులూ ముగించుకొని స్నానం చేసివచ్చింది. జపం పూర్తిచేసుకొని అత్తగారు వంటింట్లోకి వెళ్లే కోడలితో అంది—"ఈవేళ నేను ఉపవాసం ఉంటాను. నాకోసం ఏమీ చెయ్యనక్కర్లేదు. నేను మౌనంగా ఉంటాను. నన్ను ఎవరూ మాట్లాడించకండి." తరువాత ఆమె ఇంటిలోపల దొడ్డివైపు ఉన్న కుటీరంలో దీక్షదాల్చి కూర్చుంది. ఆ దొడ్డి ఒక ఉపవనంమాదిరిగా ఉంటుంది. మామిడిచెట్టుక్రింద కుటీరం, చుట్టూ తులశిమొక్కలతో, వివిధ పుష్ప, ఫలజాతులతో శాంతిదాయకంగా ఉంటుంది. అందులో ఆమె తన ఆత్మశాంతికి కావాల్సిన సామగ్రిని జోడించుకుంటూంది.

ఆమె తల్లిఅయినంతమాత్రాన్న, అత్తగారైనంతమాత్రాన్న కొడుకూకోడళ్లని తన శాసనంలో ఉంచుకోదు. ఆమెఊహలో అది అధికారం ఎంత మాత్రం కాదు. అది ఉభయపక్షాలకీ అప్రియమైన అనధికారచేష్ట. ముందుగా తను తన శేషజీవితాన్ని అశాంతితో వ్యర్థపుచ్చకుండా ఉండాలి. ఇంకొకరిమీద ఆధారపడి వాళ్లదగ్గరనుంచి అనుకూలఆచరణని ఆశించటంఅంత వెఱ్ఱి ఇంకొకటి లేదని ఆమె అంతిమ నిశ్చయానికి వచ్చింది. ఏ నియమాలవల్ల, ఏ సూత్రాలవల్ల ఆమెకి శాంతి లభిస్తూందో, ఆమెజీవితం అవరోధనలేకుండా సాగిపోతూందో, వాటికి అడ్డుతగిలించే ప్రతికూలవాతావరణంసృష్టింపబడగానే ఆమె అక్కడ తాళలేకపోయింది.

ఇదివరకు కన్నయ్య తల్లిదగ్గర కూర్చొని కాళ్లు రాస్తూ, తల రాస్తూ, ఏదో ఒక సంభాషణతో ఆమెకి ఓదార్పు కలుగజేసేవాడు. వివాహానంతరం మారిపోయాడు. తనూ, భార్య విలాసక్రీడలలో మునిగి ఆమెని మరచిపోయారు. కన్నీళ్లు తుడవటానికి ఎప్పుడో అప్పుడు బలవంతాన్న కూర్చునేవారు.

కన్నయ్య పెళ్లాంతో కలిసిపోయి తల్లిని ఏకాకిని చేశాడు. కొడుకూకోడళ్లకి తీరిక లేదు. ఎప్పుడు చూచినా నవ్వులు, పాటలు, క్రీడావిలాసాలు! ఆ ఇంట్లో ఉన్న ముసిలిది ఏమయిపోయిందో అన్న చింతే లేకపోయింది వాళ్లకి. ఆవిడ వంటలక్క అయిపోయింది. కొడుకూ,కోడలూ వేళకి తిండి తిని పోయేవారు. కోడలు కొత్తలో అత్తగారికి సాయపడేదానిలా కనిపించేది. రానురాను అదీ మారిపోయింది.

రాత్రిళ్లు సినీమాలూ, నాటకాలూ చూచి వచ్చిన కొడుకూకోడళ్లు తలుపులు టకటకాయించేవారు. తలుపు తీయవచ్చిన ఆ ముసిలిమనిషివైపు చూడనైనా చూడకుండా పోయేవారు. బారుమనే ఆ నిశ్శబ్దతలో చేతిలాంతరు పుచ్చుకొని ఆమె ఒంటరిగా ఉండిపోయేది.

కొడుకూ కోడలూ పాటలు పాడుకుంటూ, ఎకసక్కాలాడుకుంటూంటే ఆ ముసిలిది దూరంగా ఏమూలనో పడిఉండేది. ఆమె ఎలా ఉందో, ఇంట్లో ఉందో లేదో వాళ్లకి అక్కర్లేకపోయింది. ఆమె ఆ ఇంట్లో ఒక వింతజీవి అయిపోయింది. తన ఇంట్లో తనే ఘరాయిదయిపోయింది.

## ౭

ఆమెకి ఏవిధమైన లోటూ లేదు; కాని ఆమె కష్టపడుతూంది. తను చేసుకొన్న పదార్థాలే ఆమెకి

అమృత తుల్యాలుగా ఉన్నాయి. ఆచారవ్యవహారాలని పాటించలేని కోడలినుంచి తనకి అనుకూల ఆచరణని రప్పించుకోవటం, తను తెరిపిని పడటం, ఎదుటి పక్షానికి అప్రియంగా ఉంటుందన్న సూచన కనబడగానే ఆమె తన రెక్కలనీ, శేషశక్తినీ నమ్ముకుంది. వాటినే తన వృద్ధాప్యపు పెట్టుబడిగా చేసుకుంది.

మిట్టమధ్యాహ్నం మేడపైగదిలో కన్నయ్య రోహిణిపై ఒరగబోతూ ఎదురుగా కిటికీలోంచి గోచరమైన ఆ మార్మికదృశ్యాన్ని చూచి కంపించిపోయాడు. మరుగుటెండలో తన తల్లి పుష్కరిణిలో స్నానం చేసి మంచినీటిబిందె నెత్తుకొని వస్తూంది. ఆత్రోవ అంతా జనశూన్యంగా ఉంది. ఎండకి జడిసి అంతా ఇళ్లలో దాక్కున్నారు. రోహిణినుంచి వత్తిగిలి కన్నయ్య నిశ్చేష్టుడయి ఆదృశ్యాన్ని చూచాడు.

తల్లి! ఏకాంతవాసిని అయి ఆ ముసిలితనంలో పడరాని కష్టాలు పడుతూంది. అయినా ఆమెకి ఇప్పటి శ్రమలో నిశ్వాసానికి బదులు ఉచ్ఛ్వాసం, అస్థైర్యానికి బదులు ఒకవిధమైన గర్వంతో కూడిన స్థైర్యంకూడ లభించాయి. తను ఇంకెవరిమీదా ఆధారపడకుండా తన శేషజీవితాన్ని గడపాలన్న విషయం జ్ఞాపకం చేసుకుంటూ ఆమె ఒక నూతన వ్యక్తిగత ఆనందాన్ని అనుభవిస్తూంది. తనకి ఎవరిమీదా పేరాశ పెట్టుకోవాల్సిన పనీ లేదు; తిరిగి నిరాశతో, నిట్టూర్పుతో కుంగిపోవాల్సిన పనీ లేదు. ఇది సంఘర్షణలో ఎదుటి పక్షాన్ని నిరసనచేసి, తృణీకరించి తన్ను తాను నిలబెట్టుకొనే స్వంత ఓదార్పుచేష్ట కాదు. కొడుకూ కోడళ్ల కంటికి నలక అయిందనిపించుకొనే అప్రియమైన అపవాదునుంచి ఆమె విముక్తి చెందింది. తను దూరంగా ఉండటంలో ఇరుపక్షాలకీ కూడ కుశలత ఉన్నట్టు ఆమెకి తోచింది.

కొడుకూకోడళ్లు ఆమెలోని పరివర్తనాన్ని గుర్తించారు. మొట్టమొదట కొంత తెరిపిని అనుభవించారు. రానురాను అందులోంచి వ్యక్తిగత సుఖానికి బదులు కర్తవ్యచ్ఛాయలు బయటపడగానే ఒకర్ని చూచి ఒకరు తెల్లబోయారు.

